


వేకుమళ్ల కామేశ్వరరావు

నరసింహమూర్తికీ నాకూ పన్నెండేళ్లనుంచీ స్నేహం. మా యిద్దరికీ స్నేహం నాపదకొండో ఏట కలిసింది. మేము యిద్దరం ఒక బళ్లోనే చదువుకొన్నాం. మొదటి నుంచీ ఒక్క ఫ్యాక్టరీలోనే వుద్యోగాలు చేస్తున్నాం.

నరసింహమూర్తి పెళ్ళికి నేనూ వెళ్లాను. నాగవిల్లి యుద్ధంలో నేనూ చెయ్యి చేసుకున్నాను.

పెళ్లి అయిన వెంటనే మా నరసింహమూర్తిలో ఒక విపరీతపు మార్పు వచ్చింది. ఆంతరంగిక స్నేహితుణ్ణయిన నాతోనే అతను ముభావంగా మాట్లాడడం మొదలు పెట్టాడు. ఈ మార్పుకు నేను చాలా విచారించాను. "మావాడికి పెళ్ళి అవకున్నా బాగుండేదిరా" అని నేను మనస్సులో చాలాసార్లు అనుకొన్నాను. మా నరసింహమూర్తికూడా తన ముభావానికి తను నొచ్చుకునేవాడని నాకు క్రమేపీ తెలిసింది. ఎలాగంటే, అతను రెండు మూడు సార్లు నాతోనే అన్నాడు. "కొత్త నీరు వచ్చి పాత నీరును కొట్టుకు పోయిందన్నట్టుగా ఏదో వెర్రి ఆలోచనలు పెట్టుకొని మన మనస్సులు దూరం చేసుకోడం నాకు ఇష్టంలేదు" అని అతని మాటల భావం నాకు తెలియనట్టుగా నేను నటించి అతన్ని మరో ధోరణిలోకి దింపేవాణ్ణి. ముభావం వల్ల కలిగే నష్టం అతనికి అప్పుడప్పుడు స్ఫురించినా, అతని వర్తనలో మట్టుకు ఏమీ మార్పు కనబడలేదు. ఎప్పటి ముభావంతోనే వుండేవాడు.

పెళ్లి అయిన ఏడాదికి అతని భార్య కాపరానికి వచ్చింది, అంటే, యిప్పటికప్పుడే నాలుగేళ్ల కిందట అన్నమాట.

పెళ్లాం కాపరానికి వచ్చాక అతనిలో మరొక విపరీతం బయలుదేరింది. అతని కళ్ళెప్పుడూ వంటింటిమీదే వుండేవి. నాతో మాట్లాడుతూన్నంతసేపూ అథమం రెండు నిమిషాల కొక సారేనా తల వంటింటి వైపు తిప్పుతూ వుండేవాడు. తెలియక కొన్నిసార్లూ, తెలిసి కొన్నిసార్లూ తిప్పేవాడు. ఈ కొత్త రోగానికి నేను మరింత విచారించాను. ఈ మోస్తరుగా అతను నన్ను చూసి అనుమాన పడడమెందుకు? నేను అందగాణ్ణా, పోనీ అతని పెళ్లాం నన్ను చూస్తే నాతో వచ్చేస్తుందేమో అనుకోడానికి; నేను వీధంట నడుస్తూవుంటే నా

నలుపు చూసి కళ్ళు మెరుగుతూ వుంటాయి. కన్నూ, ముక్కూ తీరు అసలే లేదు. నా స్వభావం పోనీ చెడ్డదా అంటే భగవంతుడిమీద వొట్టేసి చెప్తా. అసలు నాకు అటువంటి మనుష్యులంటేనే గిట్టదు. వాళ్లని పేడ కప్పను చూసినట్టుగా చూస్తాను. అందుచేత నేను కొన్ని చిక్కులలోకూడా పడ్డాను. పోనీ, అతని పెళ్లామేనా అటువంటి మనిషా అంటే, అలాగు అనకూడదు సరి కదా తలచకూడదు కూడాను. ఆవిడ అసలు పర పురుషుణ్ణి కంట చూసిన దెప్పుడు? అందులో మనవాడి గుణం బాగా తెలుసునుకూడా కామోసు వీధి మొహం తిన్నగా చూసి ఎరగదు పాపం. ఇంతకీ ఇంట్లో అతని తల్లి వుంటూ వుంటేనే. ఇంక అతనికి అనుమానానికి అవసరమెక్కడ? నాకు క్రమేపీ ఒక్క సందేహం కలిగింది. 'నేను ఒక్కణ్ణి వచ్చినప్పుడే ఈ మోస్తరుగా వుంటాడా లేక ఎవరు వచ్చినా ఇంతేనా' అని సందేహం కలిగిన మీదట చాటుగా మాటుగా పరిశీలించి చూశాను, అతను ఇతరులతో మాట్లాడుతూన్నప్పుడు. అప్పుడూ ఇంతే. మెడ ఎలెక్ట్రిక్ ఫాన్‌లాగ వంటింటి వైపు తిరుగుతూ వుండవలసిందే. అంచేత నా ఒక్కడి ముందరే కాదు ఈ విపరీతపుచేష్ట అని నేను కొంత తశ్శాంతి పొందాను.

ఈ చేష్ట చాలాకాలం చూశాను. నా స్వభావం పూర్తిగా ఎరిగి వుండికూడా నా ముందర ఈ చేష్ట లెందుకు అని నాకు ఒకొక్కప్పుడు మహాకోపం వేసుకొచ్చేది. అప్పుడు ఇలాగ అనేద్దామనుకోనేవాణ్ణి? "అబ్బాయీ! నేను నీ పెళ్లాన్ని ఎత్తుకుపోడానికి రాలేదు. నా కలాంటి దురుద్దేశ మేమీ లేదు. అలాంటి దురుద్దేశమే వున్నవాణ్ణయితే ఇన్నాళ్లవరకూ ఈ మోస్తరుగా వుంటానా" అని. ఈ మోస్తరుగా చెప్పాలని నేను అనేకసార్లనుకున్నాను. "అబ్బాయీ!" అని కూడా అనేక సార్లు మొదలెట్టాను. కాని కడమభాగం మట్టుకు ఎప్పుడూ వుచ్చరించ లేదు.

నాకు బొత్తిగా అసహ్యం వేసింది. ఒకనాడు "వీడి రోగం చప్పగా కుదిర్చి తీరా"లని అనుకొన్నాను. అతని రోగంవల్ల నే నొక్కణ్ణే బాధపడుతున్నానని కాదు, నాకంటె అతను వెయ్యిరెట్లెక్కువగా నిష్కారణంగా బాధపడుతున్నాడు. దీని కేదో ప్రతిక్రియ తగలపెట్టాలని మనస్సులో గట్టిగా అనుకొన్నాను.

నరసింహమూర్తికి ఎఱ్ఱటి రైటింగు పాడ్ వుంది. అంతే కాదు. అతను ఎప్పుడూ ఎరుపురంగు కార్డ్ల మీద ఉత్తరాలు రాస్తూ వుంటాడు. అతనికి ఎరుపు రంగంటే అదో ఇష్టం.

నేను ఒక ఎఱ్ఱరంగు కాగితం కొన్నాను. నరసింహమూర్తి రైటింగు పాడ్‌లాంటి కాగితం కొని, ఒక పావు రావు ముక్క చింపాను—పాడ్ సైజుకంటే రెండు రెట్లు పెద్ద ముక్క అన్నమాట. ఆ కాగితంమీద నేను రాద్దామనుకొన్న రెండు ముక్కలూ గిలికాను. గిలికి, శుభ్రంగా మడతపెట్టి జేబులో పెట్టుకున్నాను. సాయంత్రం అయిదింటికి బయలుదేరి తిన్నగా నరసింహమూర్తి ఇంటికి వెళ్లాను. మా స్నేహితుడు ఇంట్లోనే వున్నాడు. అతనూ ఏమీ తోచక చూస్తున్నాడుట, మాయింటికి వద్దామా, లేక షికారు పోదామా లేక చదువుకొంటూ కూచుందామా అని. ఇంకా ఏమీ నిశ్చయంగాక కుర్చీలో కూర్చున్నాడు. నన్ను చూసేటప్పటికి మనిషి ఆనంద పరవశుడయాడు, ఇల్లు కదలకుండా బాతాఖానీ వెయ్యవచ్చు కదా అని. నేనూ వెళ్ళి ఒక కుర్చీమీద కూర్చున్నాను.

ఏదో లోకాభిరామాయణం మొదలెట్టాం. అన్ని సంగతులు గురించీ మాట్లాడుతున్నాం. చాలా చాలా విశేషాలు వెళ్లిపోతున్నాయి. నా ఉద్దేశ మేమిటంటే, నేను చెయ్యదలచుకొన్న పని నా మొహాన్ని ఏమీ కనబడకూడదని. అందుకని నేను ఆ పని జ్ఞాపకానికి రానిచ్చేవాణ్ణి కాదు. మా నరసింహమూర్తి తన పని మొదలు

పెట్టాడు. బుర్ర తెరిపిలేకుండా తిప్పుతున్నాడు. ఇలాగ కొంతసేపయింది. ఆ తర్వాత మాటమీద మాట వచ్చి తను సంపాదించిన బొమ్మలు (పత్రికలలోవి) నాకు చూపిస్తానని ఇంట్లోకి వెళ్లాడు. వెళ్ళి, కొన్ని తీసుకు వచ్చాడు. అవి చూస్తున్నాను. చాలా బాగున్నాయని అన్నాను. మరచిపోయిన బొమ్మలు మరి కొన్ని తీసుకు



రావడానికని లోప లికి వెళ్లాడు. వెళ్లి తీసుకు వచ్చాడు. ఇలాగ తను ఇంట్లో అక్కడక్కడ దాచిన బొమ్మలూ, పటం కట్టించిన బొమ్మలూ తీసుకు రావడానికని లోపలికి మళ్ళీ మళ్ళీ



వెతుకుతున్నాడు. ఇదే సమయంలో ఒక్క మాటు అతని

భార్య ఈ కిటికీ వైపు వస్తే బాగుండునని నేను మనస్సులో చాలా ఆదుర్దా పడ్డాను. బాతాఖానీ ప్రారంభించి అప్పుడే రెండు గంటలసేపు అయింది. ఇంతవరకూ అనుకున్న పని జరగలేదు. ఇంక ఇవాళకి నేననుకున్న పని జరగదని నిరాశ పడ్డాను. విచారిస్తున్నాను. ఇలాగ వుండగా ఆమె వస్తూన్న జాడ కనబడింది. నరసింహామూర్తి కూడా ఇంట్లోకి వెళ్లాడు. ఆమె కిటికీవరకూ వచ్చింది. కిటికీ పైనవున్న తాళం చెవులు అసి కుంది. మా నరసింహమూర్తి వస్తున్నాడు. నేను జేబులోంచి కాగితం తీసి కింద పారేశాను. అతను చూస్తూ



వుండగా కంగారుపడుతూ ఆ కాగితం పైకి తీసి జేబులో పెట్టాను. నా కంగారు నా మొహం మించి ఇంకా స్పష్టంగా పోలేదు. "ఏమిటా ఎర్ర కాగితం" అన్నాడు నరసింహామూర్తి. వెలవెల బోతూ "అబ్బె, అబ్బె" అన్నాను నేను. నరసింహామూర్తి మొహం ఒక్క మాటుగా తెల్లబడింది. ఉత్తర క్షణంలో నల్లబడింది. ఇంక ఎర్రబడుతూంది. నేను ఒక వెకిలి నవ్వు నవ్వాను. దానితో కూడా అతను మరింత నిర్విణ్ణుడయి పోయాడు. చిట్టచివరికి మనస్సు స్వాధీనం చేసుకుని అతను "ఏమిటా

కాగిత"మని వూరికే అడిగినట్టుగా అడిగాడు. నేనూ వూరికే చెప్పినట్టుగా "అబ్బే, ఏమీ లేదోయ్" అన్నాను. కాని అది ఎఱ్ఱ కాగితం. నేను అంతటితో వూరుకోక "ఏదోయ్, ఏం బొమ్మలు తెచ్చావు?" అని అతని ధోరణి మార్చడానికి ప్రయత్నం చేస్తూన్నట్టుగా అన్నాను. అతని అనుమానం మరింత దృఢ పడింది. తను తలచినది నిజమే అనుకొన్నాడు. నేను మళ్లా "ఏం బొమ్మలు తెచ్చావు? చూపించు" అన్నాను. అతను అతి ప్రయత్నంమీద "చూపిస్తాను" అని, అప్రయత్నంగా "ఏమిటది" అన్నాడు. అతను అడిగిన దానికి జవాబు చెప్పక నేను అతని చేతిలోని బొమ్మలు తీసుకొని ఒకటి చూసి "అబ్బ! చాలా బాగుంది! ఎక్కడ సంపాదించావో కాని" అన్నాను. కాని అతని మనస్సు మనస్సులో లేదు. "ఏమిటి! ఏమిటి!" అన్నాడు. "ఎక్కడ దొరికింది నీకీ బొమ్మ" అన్నాను నేను గట్టిగా. మనస్సు స్వాధీనంచేసుకొని అతను "ఎక్కడంటావా" అన్నాడు. అని మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. మళ్ళీ నే నడిగాను. అతను మళ్ళీ "ఎక్కడేమిటి, ఎక్కడ పడితే అక్కడే" అని అర్థంలేని మాట ఆలోచన పూర్వకంగా అన్నట్టు అన్నాడు. "ఏమిటోయ్! అలాగ మాట్లాడతావు? ఇది ఎక్కడ దొరికింది నీకని నే నడగడం." "ఉండు. జ్ఞాపకం తెచ్చుకోనీ" అని దానిని గురించే ఆలోచిస్తూన్న వాడిలాగ కనబడ్డాడు. పాపం ఎంతసేపో ఆలోచించినట్టుగా నటించాడు. ఏదయితే యేం, ఈ సందడిలో వంటింటి వైపు చూడడం మరిచిపోయాడు. "ఇంకా తెమలలేదా నీ ఆలోచన" అని నే నన్నాను. దానికి జవాబు రాలేదు. మళ్లీ అడిగాను. "ఉండు, ఆలోచించనియ్యవోయ్" అన్నాడు, నిశ్చల భావంతో అన్నట్టు. "అయితే రాత్రి అంతా ఆలోచించు నేను రేపు మళ్ళీ వస్తానులే చెప్పుదువుగాని" అని లేచాను. అతను అదరిపడి "అబ్బే! ఇప్పుడే చెప్తానుగా. కూచో, జ్ఞాపకం వస్తూవుంటేనే" అని నన్ను చెయ్యి పట్టుకుని కూర్చోబెట్టి "ఇదిగో చెప్తాను వుండు" అని అతను ఇంట్లోకి వెళ్లబోయాడు. కాని మళ్ళా ఏమి జ్ఞాపకం వచ్చిందో ఏమిటో, వాలు కుర్చీలోనే కూర్చుని "అమ్మా!" అని ఒక్క కేక పెట్టాడు. నేను హడిలిపోయాను. "అయ్యో! దేవుడా! నాకు ఏంరంకు తెచ్చి పెడతాడో ఏమిటో! అని. "ఏం నాయనా!" అంటూ అతని తల్లి వచ్చింది. "ఇవాళ రాత్రి భాస్కరరావు మన ఇంట్లోనే భోంచేస్తాడు" అన్నాడు నరసింహమూర్తి. "అయితే సరే" అని చెప్పి ఆవిడ వెళ్లిపోయింది. "ఏమోయి భోజనానికి లే" అన్నాడు నరసింహమూర్తి. వీడి అనుమానం మరింత దృఢం చెయ్యడానికి నాకు అవకాశం దొరికింది కదా అని నేను, "అబ్బే! ఇంటికి పోతానోయ్" అన్నాను.

"అలాగు కాదు, నామాట విను."

"ముందు నామాట విను. ఇంటికి పోతాను."

"భోంచేసిన తర్వాత వెళుదూ గానిలే."

"పండుగనా, పర్వమనా."

"ఇవాళ నువ్వూ నేనూ కలిసి భోంచెయ్యాలని నాకు సంకల్పం కలిగింది" అన్నాడు దీక్షగా నరసింహమూర్తి.

"మరోమాటు చేద్దాంలే పోనీ."

"నామాట వినవూ."

"ఏం"

"అడగక, అడగ అడిగాను" అని కొంచెం దీనంగా అన్నాడు.

"పోనీ మరోమాటు భోంచేద్దాంలే" అని నిర్లక్ష్యంగా అన్నాను నేను.

"ఇదిగో! నువ్వు భోంచెయ్యకపోతే, నే నివాళ అసలు భోంచెయ్యను" అని నిశ్చయంతో అన్నాడు.

"ఛ, ఛ. అంత పట్టుదల ఏమిటోయ్ వెధవ భోజనానికి. అలాగే భోంచేస్తాలే" అని నేను అన్నాను.

నరసింహామూర్తికి పోయిన ప్రాణం లేచి వచ్చినట్టయింది.

“పట్టుపంచలు తే” అని ఒక్క పిచ్చి కేక పెట్టాడు. వాళ్ల అమ్మ నీళ్ల చెంబులూ, పట్టు పంచలూ తీసుకువచ్చి పెట్టింది. “లే, లెమ్మ”న్నాడు అతను. “అలాగే”అని నేనూ లేచాను. కోటు విప్పాను. నరసింహామూర్తి నన్ను పరిశీలిస్తూనే వున్నాడు. నా కోటు అతని కోటు పక్కనే చిలక కొయ్యను తగిలించాను. అతని వైపే చూస్తూ కాళ్లు కడుక్కుని పట్టు పంచ కట్టుకొన్నాను. అతనూ పట్టు పంచ కట్టుకొన్నాడు, కాళ్లు కడుక్కున్నాడో లేదో గాని.........మూడు వంతుల భోజనమయింది. మజ్జిగ దగ్గరికి ఇద్దరం వచ్చాం. నరసింహామూర్తి “ఏమిటో డోకు వస్తూన్నట్టుగా వుంది. నిజంగా రావడంలేదు కాని అనుమానంగా వుంది. ఏదయినా ఇంక మజ్జిగ పోసుకోను. ఇమిడిన మట్టుకే చాలు” అన్నాడు. తల్లి “పోనీ కాస్త వేసుకుని చూడరా” అంది. కాని అతను వినక లేచిపోయాడు. నేనూ బలవంతం చేద్దామనుకొన్నానుగాని అతను ఇంతట్లోకే పెరట్లోకి వెళ్ళిపోయాడు. చెయ్యి కడుక్కుని మళ్ళీ తిరిగి సావిట్లోకి వెళ్ళిపోయాడు. నేనూ మజ్జిగ వేసుకోకుండా లేచిపోయి అతనేమిచేస్తాడో చూద్దామని అనుకొన్నాను. అనుకొని అతని తల్లితో “నాకు కొంచెం శైత్యభారంగా వుందండి. మజ్జిగ పోసుకుంటే జ్వరం తప్పదు. కొంచెం ముందు జాగ్రత్తపడితేనే మే. మజ్జిగ వద్దండి” అన్నాను. “స్నేహితుడితో సమంగా నువ్వూ చేస్తావా? మొహమాట మేమిటి నీకు మా యింట్లో. కొంచెం పోసుకో” అంది ఆమె. “అలాగు కాదండి, నాకు మొహమాట మేమిటి మీ యింట్లో. జ్వరం తప్పదు మజ్జిగ పోసుకుంటే, అంచేత వెళ్ళిపోన్నాను” అని, పరిషేచన చేసి లేచిపోయాను. “స్నేహమంటే ఇలా గుండాలి” అని ఆవిడ కొంచెం గట్టిగా తనలో అనుకుంది.

నేనూ సావిట్లోకి వచ్చాను. మా నరసింహామూర్తి నా జేబులో కాగితం విప్పి చూస్తున్నాడు. మడత విప్పడంతోనే పెద్ద కాగితం అవడంచేత అతని అనుమానం సగం తీరిపోయినట్టుగా వుంది. అంచేత నింపాదిగా నన్ను చూసి “ఏమిటోయ్! నాజేబు అనుకొని నీ జేబులో కాగితం తీశాను. నేను ఒక ఉత్తరం రాసి మడతపెట్టి జేబులో పెట్టుకున్నాను. అది పోస్టులో వెయ్యకముందు మరో చిన్న ముక్కకూడా రాసి పడేద్దామనుకుని తీశాను. తీరా చూసేటప్పటికి నీదీ కాగితం. ఏమిటీ! ఏదో విచిత్రంగా రాశావు! ఇదేమిటి? ‘వెంకట్రావు వక్రి అనుమానం మనిషి. వాడి రోగం చప్పగా కుదర్చాలి’ ఇదేమిటి ఈ విచిత్రం రాత. దీని అర్థం ఏమిటి” అన్నాడు.

“అసలు ఇవాళ ఇక్కడికి రావడం దాన్నిగురించి మాట్లాడ డానికే” అన్నాను నేను.

“అంటే.”

“వెంట్రావుకు ఒక ప్రాయశ్చిత్తం చేద్దామనుకొన్నాను. దాన్నిగురించి నీతో మాట్లాడడానికి వచ్చాను.”

“అయితే కాగితంమీద ఎందుకు రాశావు!”

“ఆ కాగితం జేబులో వుంటే అది తప్పకుండా జ్ఞాపకమొస్తుందని.”

“అయితే మాట్లాడ లేదేం!”

“నువ్వేదో బొమ్మలు చూపిస్తున్నావు సరదాగా. అంచేత, ఇప్పుడేం తొందర వచ్చింది, పోనీ రేపు చెప్దాంలే” అని వూరుకున్నాను.

“ఎలాగ ప్రాయశ్చిత్తం చేద్దామని నీవూహ.”

“ఎలాగంటావా. తీరుబాటుగా చెప్తాను కూర్చో మరి అయితే.” నరసింహామూర్తి చాపవేసి పాందాను తీసుకువచ్చాడు. ఇద్దరం తమలపాకులు వేసుకుం

టున్నాం. అప్పుడు నేను "ఎలాగంటే, నేను అతన్ని ఈ మాస్తరుగా ఏడిపించా లనుకొన్నాను" అన్నాను.

"ఊఁ."

"నే నిలాగ ఒక ప్లాను వేశాను. నేను వెంకట్రావుతో మాట్లాడుతూ వుండాలి. అదే సమయంలో అతని భార్యకూడా ఏదో పనిమీద కిటికీదగ్గరికి రావాలి. అప్పుడు నేను నా జేబులోంచి ఒక కాగితం తీసి కింద పారేసి చప్పున మళ్ళా తీసి జేబులో పెట్టుకోవాలి. ఆ కాగితం అతని పెళ్లాం రాసి పారేసినట్టుగా అతనికి అనుమానం కలిగేటట్లు నేను అపని అంతా చెయ్యాలి" అన్నాను.

నరసింహామూర్తి మొహాన్ని నెత్తురు లేదు. జవాబు అసలే లేదు. ఎర్రకాగితం మహిమ అతనికి ఇప్పుడు పూర్తిగా బోధ పడింది. తర్వాత నేను "ఏమంటావు" అన్నాను. అతను జవాబు చెప్పలేదు. సిగ్గుపడి మొహం వంచుకొన్నాడు. "చెయ్యమంటావా అలాగ" అన్నాను నేను ధాటీగా. జవాబు లేదు. "చెయ్యమనేనా నీ వుద్దేశం" అని మళ్లీ అడిగాను,

"ఎందుకులే పోని" అన్నాడు అనలేక అనలేక.

"నువ్వు చెయ్యమంటే చేస్తాను లేకపోతే మానేస్తాను."

"ఎందుకులే పోనీ" అని నెమ్మదిగా అన్నాడు.

"పోనీ అయితే మానేస్తాను" అన్నాను నేను.

ఇదంతా అతన్నిగురించే అని అతనికి స్పష్టంగా బోధ పడింది. నాకు కావలసిందీ అదే. ఆ తర్వాత నేను ఆట్టే సేపు కూచోక "వెళ్ళొస్తా నోయ్" అని చెప్పి ఇంటికి వచ్చేశాను.

ఆ మర్నాడు నేను మళ్లా అతని ఇంటికి వెళ్లాను. ఆటుతర్వాత అనేకసార్లు అతని ఇంటికి వెళ్లాను. కాని అతను ఎప్పుడూకూడా మళ్లా వంటింటివైపు బుర్ర త్రిప్ప లేదు. అలవాటు ప్రకారం బుర్ర వెళ్లబోతూవుంటే సగం దారిలోనే ఆపి యిటు తిప్పుకునేవాడు. మునుపటి లాగ ముభావంగా మాట్లాడడం కూడా తగ్గిపోయింది. సాయిలా బాయిలాగా మాట్లాడుతున్నాడు. పెళ్లాం మీద అనుమాన పడడం పోగొట్టుకున్నాడనే నా నిశ్చయం. ఈ మోస్తరుగా అతను బాగుపడ్డాడు, నేనూ సుఖ పడ్డాను.

రుచికిని సౌఖ్యమునకును అమోఘమైనది

రుక్మిణి కుక్కర్

ఈ వంట సెట్టువల్ల, వంట సౌఖ్యంగా, సులభంగా, హాయిగా తయారగుటయే గాక భోజనకాలంలో మంచి రుచిని కలిగించి, సత్తును పెంపొందించును.

1, 2, 4, 6, 8, 12, 16 మంది, జనులకు తగిన 7 సెట్లు క్రమ వరుసగ రూ. 10, 14, 18, 23, 29, 35, 41 రూపాయల ఖరీదు.

ముఖ్య నగరము లందంతటను ఏజెంట్లు కావలెను.

రుక్మిణి కుక్కర్ కంపెని రాయపురం (13) మదరాసు.

వివరముల పుస్తకము ఉచితము.

నేడే వ్రాయుడు.